క్లుప్తంగా

నేడు వైఎస్సార్ ఆసరా పంపిణీ

మార్కాపురం రూరల్: నేడు పట్టణంలోని ఎస్సీ బీసీ కాలనీ గల డ్వాక్రా బజారులో వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి హాజరవుతారని ఎంపీడీఓ తోట చందన ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులు హాజరుకావాలని కోరారు.

అర్ధవీడులో క్రికెట్ టోర్నమెంట్

అర్ధవీడు (కంభం): రిపబ్లిక్‌డేను పురస్కరించుకొని ఈ నెల 26వ తేదీ నుంచి అర్ధవీడులో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న జట్లు రూ.700 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9052345576, 9347769870 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అవినీతిపై ఫారెస్ట్ విజిలెన్స్ అధికారుల తనిఖీ

దర్శి: పల్లెవనం పార్కు అభివృద్ధి పనుల్లో జరిగిన రూ.45 లక్షల అవినీతిపై ఫారెస్ట్ విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. విజయవాడ విజిలెన్స్ డీఎఫ్‌ఓ రవిశంకర్ శర్మ, ఆయన టీమ్ వచ్చి బుధవారం విచారణ జరిపారు. గతంలో ఇక్కడ ఫారెస్ట్ బీట్ అధికారి అసుర తనకు సంబంధం లేకున్నా అవినీతిపై నోటీసులు ఇచ్చారని, ఇచ్చిన ఫిర్యాదుపై ఇక్కడ ఉన్న పరిస్థితులకు సంబంధం ఉందా లేదా అనే విషయాలు వాకబు చేశారు.

కొమరోలు ఎస్సైకి పదోన్నతి


ఎస్సై సుబ్బరాజు

కొమరోలు: స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎ.సుబ్బరాజు పదోన్నతిపై వెళ్లనున్నారు. గుంటూరు జోన్ పరిధిలో 35 మంది ఎస్సైలకు సీఐలుగా పదోన్నతులు రాగా వారిలో కొమరోలు ఎస్సై ఎ.సుబ్బరాజు ఉన్నారు. సంవత్సరం 3 నెలల పాటు ఎస్సైగా సుబ్బరాజు ప్రజలకు సేవలు అందించి మన్ననలు పొందారు. సీఐగా పదోన్నతిపై వెళ్లనున్న ఎస్సైని పలువురు అభినందించారు.

అందరికీ నాణ్యమైన వైద్యం

గిద్దలూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యం అందుబాటులోకి వచ్చిందని నగర పంచాయతీ వైస్ చైర్మన్ ఆర్‌డీ రామకృష్ణ, అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని నంద్యాల రోడ్డు పీహెచ్‌సీలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటి వద్దకు చేరుకుని వారి ఆరోగ్య స్థితిగతుల వివరాలు తెలుసుకుంటున్నారన్నారు. డాక్టర్లు భార్గవరెడ్డి, షరీఫ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వలి పాల్గొన్నారు.

ఫిజియోథెరపీని వినియోగించుకోవాలి

పుల్లలచెరువు: ప్రతి బుధవారం మండల విద్యావనరుల కేంద్రంలో జరిగే ఫిజియోథెరపీని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో శామ్యూల్‌జాన్ కోరారు. బుధవారం విద్యావనరుల కేంద్రంలో జరిగిన ఫిజియోథెరపీ సేవలను ఆయన తనిఖీ చేశారు. ఎంఈవో మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులు తప్పని సరిగా ఫిజియోథెరపీ సేవలు ఉపయోగించుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తప్పని సరిగా కేంద్రాలకు విద్యార్థులను తీసుకొచ్చే విధంగా చూడాలన్నారు. ఫిజియోథెరపీస్టు డాక్టర్ ఆంకారావు, ఐఈఆర్‌టీ తేజరూపిని, ఆర్‌పీలు సుబ్బారెడ్డి, సత్యం పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితునికి రూ.10 వేల ఆర్థిక సాయం


నగదు అందిస్తున్న బుర్రి కాటమయ్య

మార్కాపురం: అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి అందించిన రూ.10 వేలను 14వ బ్లాక్ కౌన్సిలర్ బుర్రి యల్లమ్మ కాటమయ్య బాధితుడు అరబోలు సుబ్బయ్యకు బుధవారం సాయంత్రం పంపిణీ చేశారు. ప్రభుత్వ పరంగా సాయం అందించేందుకు కృషి చేస్తామని వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఉత్తమ్‌కుమార్ భరోసా ఇచ్చారు.

గౌతమి డిగ్రీ కళాశాలలో ఆటల పోటీలు

దొనకొండ: రిపబ్లిక్ డేను పురస్కరించుకుని స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలో ఆటల పోటీలు బుధవారం నిర్వహించారు. విజేతలకు జనవరి 26 రిపబ్లిక్ డే సందర్భంగా ప్రిన్సిపాల్ గోపి చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నట్లు కళాశాల అడ్మిన్ పి.ఎఫ్రాయిమ్ (నాని) తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలకు సీఎం జగన్ ప్రోత్సాహం


ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ, పక్కన నాయకులు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: రాష్ట్రంలో క్రీడలకు, క్రీడాకారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలను ఎమ్మెల్యే కేపీ ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు పక్కన పెట్టి ప్రతి ఒక్కరూ ప్రతిభను పెంపొందించుకోవాలన్నారు. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదపడతాయన్నా. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే కేపీ, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, తర్లుపాడు ఎంపీపీ భూలక్ష్మి తదితరులు ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడాకారులతో కలిసి కాసేపు ఆటలాడి ఉత్సాహపరిచారు. ఎస్‌వీకేపీ కళాశాలలో క్రికెట్, ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, కౌన్సిలర్ దొడ్డా భాగ్యలక్ష్మి, నాయకులు సీహెచ్ శ్రీనివాసులు, ఉత్తమ్‌కుమార్, వివిధ పాఠశాలల పీఈటీలు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

గిద్దలూరు రూరల్: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను ఉత్సాహభరితంగా నిర్వహిస్తున్నారని ఎంపీడీఓ హేమలత అన్నారు. స్థానిక నగర పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో ముండ్లపాడు రోడ్డు ఆదర్శ బీఈడీ కళాశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం ఆటల పోటీల్లో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు క్రికెట్, వాలీబాల్ వంటి ఆటల పోటీలు నిర్వహించారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్ ఆర్‌డీ రామకృష్ణ, అర్ధవీడు ఎంపీడీఓ మస్తాన్‌వలి, సచివాలయం టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ రాజారెడ్డి, ఈఓఆర్డీ చెన్నారావు, ఏఈ శంకర్‌నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వలి, కార్యదర్శి రాఘవరావు, పీఈటీ శోభన్‌బాబు పాల్గొన్నారు.


గిద్దలూరులో క్రికెట్ అడుతున్న ఎంపీడీఓ

చరిత్రలో లేని విధంగా ఆడుదాం ఆంధ్రా!

● జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో నేని విధంగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టారని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా బుధవారం నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలను జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు ప్రారంభించారు. వెంకాయమ్మ,శివప్రసాద్‌రెడ్డిలు క్రికెట్ ఆడి అందరినీ ఉత్సాహపరిచారు. వారిని దుశ్శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. వెంకాయమ్మ,శివప్రసాద్‌రెడ్డిలు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ ఉందన్నారు. అందుకే నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి, పేదల పిల్లలకు ఇంగ్లిష్ మీడియం విద్య, అమ్మవడి, ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ వంటి పథకాలు ప్రవేశ పెట్టి పేద విద్యార్థులకు అండగా నిలిచారన్నారు. నగర పంచాయతీ కమిషనర్ మహేష్, ఎంపీడీఓ హనుమంతరావు, పీడీలు అంజిరెడ్డి, ఎంపీపీ సుధా అచ్చయ్య, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, కౌన్సిలర్‌లు మేడం మోహన్‌రెడ్డి, జగన్నాథం మోహన్‌బాబు, ఆవుల శివారెడ్డి, ఎంపీటీసీ సంఘ జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, సర్పంచ్ కేసరి రాంభూపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు చింతలపూడి శ్రీనివాసరెడ్డి, గోను వెంగళరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, మాజీ ఎంపీటీసీ కరిపిరెడ్డి సుబ్బారెడ్డి, నాయకులు ముప్పూరి బ్రహ్మయ్య, వెన్నపూస బాపిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


బ్యాటింగ్ చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

యర్రగొండపాలెం: బాలికల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో బాలికలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ ఆవిష్కరించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విజయవాడ జనక్రాంతి ట్రస్ట్, మార్కాపురం వాసవి వనితా క్లబ్ వారు బాలికలకు శానిటరీ నాప్‌కిన్స్ పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి, ఎంపీడీవో వైవీ నాగేశ్వర ప్రసాద్, ఈవోపీఆర్డీ ఈదుల రాజశేఖరరెడ్డి, ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లు నాయక్, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ దుగ్గెంపూడి వెంకటరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, వాసవి క్లబ్ సభ్యులు గోళ్ల వరలక్ష్మి, మోదాల రత్నమ్మ, బైసాని అన్నపూర్ణ, వేముల మల్లీశ్వరి, పరిమి కిశోర్ పాల్గొన్నారు.

మార్కాపురం: జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బాలికలు సమాజంలో సముచిత స్థానంలో ఉండాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని కళాశాల కరస్పాండెంట్ అన్నా కృష్ణచైతన్య ఆకాంక్షించారు. ఉమన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కోఆర్డినేటర్ అమృతవల్లి, ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రంగనాయకులు, ఏఓ ప్రభాకర్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో..

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవం సందర్భంగా పట్టణంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ బుజ్జి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్: మండలంలోని రాయవరం మండల ప్రజాపరిషత్ పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వినుకొండ రాజేష్ మాట్లాడుతూ.. బాలికలు బాగా చదువుకుని జీవితంలో ముందుకెళ్లాలన్నారు. విద్యార్థినులకు మ్యూజికల్స్ చైర్స్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు హెచ్‌ఎం షేక్ ఖలీమాభాను బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, పిచ్చయ్య, భ్రమరాంబదేవి, సీఆర్పీ గ్లోరీ రాణి, పాఠశాల చైర్మన్ కాశీ పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్

మార్కాపురం రూరల్: జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మార్కాపురం మండలంలోని వేములకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సొసైటీ ఫర్ ఫాస్ట్ జస్టిస్, మండల లీగల్ సర్వీస్ సొసైటీ మార్కాపురం కోర్టు ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హ్యూమన్‌రైట్స్ సొసైటీ జనరల్ సెక్రటరీ నందిగం సుస్మిత భూషణ్‌కుమారి మాట్లాడుతూ.. బాలికలందరూ చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లాయర్ ఉషశ్రీ, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గురవయ్య, ఎమ్ఎల్ఎస్ సభ్యులు వల్లీనాథ్, పాపారావు, బుజ్జీ, శ్యామ్, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తర్లుపాడు: మండలంలోని లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం మౌలాలి ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలను చదివించాలని, వారి ఉన్నతికి బంగారు బాటలు వేయాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని బాలికలు అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్‌కే షెక్షావలి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వేములకోటలో మాట్లాడుతున్న సుష్మితాభూషణ్‌కుమారి

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

పుల్లలచెరువు: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని తహసీల్దార్ కె.దాసు అన్నారు. బుధవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో ప్రిన్స్‌పాల్ లిల్లీప్రకాశ్‌వాణి అధ్యక్షతన జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాలికల హక్కులు, రక్షణ అనే వాల్‌పోస్టర్‌ను తహసీల్దార్ దాసు ఆవిష్కరించి మాట్లాడారు. బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. ఇందుకోసం ప్రత్యేక చట్టాలు అమలు చేస్తోందన్నారు. బాలిక విద్య, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని బాలికలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. తల్లిదండ్రులు కూడా బాలికలను చదివించేలా చూడాలన్నారు.

గిద్దలూరు రూరల్: ఆడపిల్ల దేశానికి గర్వ కారణమని జేవీవీ రాష్ట్ర నాయకుడు పి.స్వరూపారెడ్డి అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జేవీవీ ఆధ్వర్యంలో పట్టణంలోని రాజుపారా మెడికల్ కాలేజీలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పురుషులతో సమానంగా బాలికలు సమాజంలో అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారన్నారు. మన దేశంలో కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ వివక్షతకు గురవుతున్నారని పేర్కొన్నారు. జేవీవీ నాయకులు వెంకటేశ్వర్లు, కళాశాల అధ్యాపకులు రాజేష్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

తుంపర సేద్యంతో బెట్ట నివారణ

తాళ్లూరు (ముండ్లమూరు): పంటలకు తుంపర సేద్యంతో నీరు పెట్టడం ద్వారా బెట్ట నుంచి కాపాడుకోవచ్చని వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. మండలంలోని కొర్రపాటివారిపాలెంలో బుధవారం క్షేత్ర పర్యటనలో భాగంగా రైతులకు పలు సలహాలు సూచనలు చేశారు. రైతులు సాగు చేసిన ఎలాంటి పంటలకైనా తుంపర సేద్య విధానం అమలు చేయవచ్చన్నారు. తద్వారా కలువలు, గట్టు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉండదన్నారు. దీంతో భూమి, పంట నష్టపోకుండా ఉంటుందన్నారు. మొక్కలకు అవసరమైన నీటిని ఎక్కువ సార్లు అందించవచ్చన్నారు. నీరు ఎక్కువగా నిల్వ ఉండదన్నారు. మట్టి గడ్డకట్టదన్నారు. పైరుకు అవసరమైన గాలి, వెలుతురు అవసరమైన మేర అందుతుందన్నారు. ఎక్కువ దిగుబడులకు అవకాశం ఉందన్నారు.

కులగణన పక్కాగా ఉండాలి

పుల్లలచెరువు: కులగణన సర్వే పక్కాగా నిర్వహించాలని ఎంపీడీవో మరియదాసు సూచించారు. బుధవారం ఆయన మండల పరిధిలోని తెల్లగట్లలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న కులగణన సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తప్పులు లేకుండా సర్వే చేయాలన్నారు. చిన్న పిల్లలు, పురుషులు, మహిళలు తదితర సమాచారం సేకరించి వెబ్‌సైట్‌లో పొందపరచాలన్నారు.

మాగుంట రాఘవరెడ్డి సుడిగాలి పర్యటన

దొనకొండ: ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసరెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డి మండలంలో బుధవారం పలు గ్రామాల్లో పర్యటించారు. స్థానిక రామలింగయ్య కాంప్లెక్స్ ఆవరణలో కార్యకర్తలతో మాట్లాడారు. తొలుత వికలాంగులతో కొద్దిసేపు ముచ్చటించారు. నాయకులు, కార్యకర్తలు ఆయనను శాలువాలతో సన్మానించి బొకేలు అందజేశారు. ఆయన్ను కలిసిన వారిలో తమ్మనేని సుబ్బారెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, చందవరం ఎంపీటీసీ రాజు, సుబ్బయ్య, వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

కురిచేడు: మండలంలోని దేకనకొండ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మాగుంట రాఘవరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. మాగుంట అభిమానులతో కొద్దిసేపు ముచ్చటించారు. బెల్లం చంద్రశేఖర్, సురేష్, యన్నాబత్తిన వెంకటసుబ్బయ్య, ఆవుల వెంకటరెడ్డి, కండె గురవయ్య, చిన్న రాజయ్య, సాంబయ్య, శివయ్య, రామయ్య పాల్గొన్నారు.

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని కొర్రపాటివారిపాలెం వద్ద నిర్మించిన బస్ షెల్టర్‌ను మాగుంట రాఘవరెడ్డి బుధవారం పరిశీలించారు. ప్రయాణీకుల సౌకర్యార్థం ఒంగోలు రహదారిలో కొర్రపాటివారిపాలెం వద్ద ఐదు లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన బస్ షెల్టర్‌ను ఆయన ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు కొర్రపాటి విష్ణు, శరత్‌బాబు, శ్రీనివాసరావులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ఎంపీపీ ఇడమకంటి వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ చార్లెస్ సర్జన్, నాయకులు వీసీ రెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.


జెడ్పీటీసీ మారాన్ని పరామర్శిస్తున్న మాగుంట రాఘవరెడ్డి

కంభం: మాగుంట చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కంభంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మహిళలకు మూడు నెలలపాటు కుట్టుమిషన్ శిక్షణ ఇచ్చి ఉచితంగా మిషన్‌లు అందజేయనున్నట్లు సెంటర్ నిర్వాహకులు తెలిపారు. ఎన్ఆర్ఐ సయ్యద్ రఫీ, సయ్యద్ ఉస్మాన్‌బాషా, బాదరయ్య, ఇమామ్, సరాళ చెన్నారెడ్డి, రాజేశ్వరరెడ్డి, నందిరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తాళ్లూరు (ముండ్లమూరు): జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డిని ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి కుమారుడు మాగుంట రాఘవరెడ్డి బుధవారం పరామర్శించారు. మారం వెంకటరెడ్డి ఇటీవల కంటికి శస్త్ర చికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చేరుకొని వెంకటరెడ్డిని పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఇడమకంటి వెంకటేశ్వరరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు కరిముల్లా, దర్శి కౌన్సిలర్ వీసీ రెడ్డి, సర్పంచ్‌లు సుమలతాశ్రీకాంత్‌రెడ్డి, చార్లెస్ సర్జన్, వలి, నాయకులు అంజలీ ప్రసాద్, గంగిరెడ్డిపాలెం యలమందారెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కేపీతో మాట్లాడుతున్న రాఘవరెడ్డి

మార్కాపురం టౌన్: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి తనయుడు రాఘవరెడ్డి బుధవారం శ్రీదేవిభూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ మాజీ చైర్మన్ కేశవరావు, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాల మురళీకృష్ణ, ఈఓ శ్రీనివాసరెడ్డి స్వాగతం పలికారు. అనంతరం రాఘవరెడ్డి మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డిని పరామర్శించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ డీవీ కృష్ణారెడ్డి, కందుల ఓబులరెడ్డి హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ కందుల గౌతమ్ నాగిరెడ్డి ఇంటికి వెళ్లి మాట్లాడారు.

అతివలదే అగ్రస్థానం

● గిద్దలూరు నియోజకవర్గ ఓటర్లు 2,37,079

బేస్తవారిపేట: గిద్దలూరు నియోజకవర్గంలో మహిళా ఓటర్లేదే అగ్రస్థానం. వారే నిర్ణేతలు కానున్నారు. నియోజకవర్గంలో 2,37,079 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళలు 1,18,831, పురుషులు 1,18,229 మంది ఉన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఫైనల్ ఓటరు జాబితా ప్రకటించారు. ఓటర్లు తమ ఓటు హక్కు ఉందో, లేదో అనే విషయం జాబితాల్లో పరిశీలన చేసుకునేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శనకు ఉంచారు.

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు
బేస్తవారిపేట	20,610	20,202	1
అర్ధవీడు	14,049	13,897	5
కంభం	18,608	19,249	3
రాచర్ల	14,025	14,402	1
గిద్దలూరు రూరల్	19,654	19,470	4
గిద్దలూరు ఎస్‌పీ	14,773	15,258	5
కొమరోలు	16,510	16,353	0

జగనన్నను సీఎం చేయడమే లక్ష్యంగా పనిచేయాలి


బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ శివప్రసాద్‌రెడ్డిలను సత్కరిస్తున్న జేసీఎస్ కన్వీనర్‌లు

దర్శి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 2024 ఎన్నికల్లో మళ్లీ సీఎం చేయడమే లక్ష్యంగా పని చేయాలని దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సూచించారు. స్థానిక బూచేపల్లి నివాసంలో ఐదు మండలాలు జేసీఎస్ కన్వీనర్‌లతో శివప్రసాద్ రెడ్డి సమావేశంలో మాట్లాడారు. సచివాలయాల్లో పని తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి నాయకుడు, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని చెప్పారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి నాయకుడు కార్యకర్తలను కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నేడు జరిగే ఎన్నికల ప్రచారం ప్రారంభోత్సవానికి నిర్వహించే బైక్ ర్యాలీలో ప్రతి నాయకుడు, కార్యకర్త పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. జేసీఎస్ మండల కన్వీనర్‌లు మేడికొండ జయంతి, యాడిక శ్రీనివాసరెడ్డి, బత్తినేని వెంకటేశ్వర్లు, చింతా శ్రీనివాసరెడ్డి, ఎదురు కోటిరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, కిక్కురు రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం

పొదిలి: ప్రజల ఆరోగ్య సంరక్షణే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమని సచివాలయం కన్వీనర్ జి.చెన్నారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మూడో సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 300 మందికి పలు రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పలువురికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. నూతనంగా మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఆఫ్తాలమిక్ అసిస్టెంట్ నరసింహారావు, వైద్యులు శరత్, వీరబాబు, డెర్మటాలజీ వైద్యులు, జనరల్ సర్జన్, సీహెచ్‌ఓ విజయలక్ష్మి, పీహెచ్‌ఎన్ నాగమణి, సూపర్‌వైజర్ మెరీనా, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్ పాల్గొన్నారు.


పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దాం

● ఎంపీపీ అరుణ చెంచిరెడ్డి

మార్కాపురం రూరల్: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించడమే ప్రధాన లక్ష్యమని ఎంపీపీ పోరెడ్డి అరుణా చెంచిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జ్యోతి సృజనకు సూచించారు. ఆరోగ్య సురక్ష 2వ విడత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకునేలా చూడాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, ఎంపీడీఓ తోట చందన, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ అరుణా చెంచిరెడ్డి

పనితీరు మార్చుకోకుంటే సస్పెండ్ చేస్తా!

● సిబ్బందిని హెచ్చరించిన జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి

పొదిలి రూరల్: ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ, ప్రతి ఉద్యోగి, సిబ్బంది తమకు కేటాయించిన పనులు సకాలంలో చేయాలని, అలా పని చేయని వారిని సస్పెండ్ చేస్తానని జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి హెచ్చరించారు. బుధవారం పొదిలి మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ముందుగా సిబ్బంది పనితీరును పరిశీలించారు. రికార్డు రూమ్‌లో ఫైల్స్ ఎక్కడ పడితే అక్కడ చెల్లాచెదురుగా పడిఉన్నాయి. దీనిపై సూపరింటెండెంట్ పద్మావతి, రికార్డు అసిస్టెంట్ శ్రీలక్ష్మిపై సీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. 2015–16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రికార్డులు కావాలని కోరగావారి నుంచి సమాధానం రాలేదు. దీంతో అసహనం వ్యక్తం చేస్తూ రికార్డు రూమ్‌ను శుభ్రపరచి, ఇయర్ల వారీగా రికార్డులు విభజించి, బోర్డులు తగించాలని ఆదేశించారు. 15 రోజులకు వచ్చి తనిఖీ చేస్తానని, పనితీరు మార్చుకోకపోతే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. అనంతరం విలేకర్లుతో మాట్లాడారు. పొదిలి నగర పంచాయతీలో కులగణన సర్వేను పరిశీలించినట్లు చెప్పారు. దాదాపు 40 శాతం సర్వే పూర్తి అయిందన్నారు. కులగణనపై ఎవరికీ అపోహలు వద్దని, ఇది కేవలం ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులను తెలుసుకోవడానికి, తద్వారా సంక్షేమ పథకాలు అందించేందుకు ఉపయోగపడుతుందన్నారు. సర్వేకు వచ్చిన సిబ్బందికి వారు అడిగిన సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఐదేళ్లకు ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు 2022–23 సంవత్సరానికి సంబంధించి సెకండ్ ఇన్‌స్టాల్‌మెంట్ నిధులు జిల్లాకు వచ్చినట్లు తెలిపారు. ఎన్నికలు జరగని పొదిలి, చీరాల, వేటపాలెంకు నిధులు రాలేదన్నారు. నిధులు పుష్కలంగా ఉన్నందున తాగునీరు, శానిటేసన్ ఖర్చు చేసుకోవచ్చన్నారు. రాబోవు రెండు నెలల్లో మిగిలిన నిధులు వస్తాయన్నారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 రకాల పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర 50 రోజుల నుంచి జిల్లాలో జరుగుతోందన్నారు. ఆయన వెంట ఈఓఆర్డీ కృష్ణ, శ్రీనివాసరెడ్డి, సిబ్బంది ఉన్నారు.


సిబ్బందిని ప్రశ్నిస్తున్న జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి